ఓం నారాయణ - ఆదినారాయణ

# అవధూత లీల

## అధ్యాయము - 15

## భిక్షాన్నం



ఎందరో ధనికులు వచ్చి ధన రాసులు శ్రీస్వామివారి పాదాల చెంత కుమ్మరించినా వారికి ప్రశ్నలు చెప్పేది లేదు. పైవాళ్ళు ఒప్పుకోలేదు అనిగానీ, మాట రాలేదనిగానీ చెప్పి త్రిప్పి పంపేవారు. భక్తి శ్రద్ధలుగల వారికి డబ్బు పెట్టకపోయినా వారు అడుగకుండానే వారికి తమ ఆశీస్సులు వ్రాయించి, అభయ ముద్ర వేసిన చీటీలు ఇచ్చేవారు. కనుక ఎల్లవేళలా భిక్షాన్నం మీద ఆధారపడేవారు. తమ కోరికలు తీరిన భక్తులు శ్రీస్వామివారి విడిదిలో సంతర్పణ చేసినా సరే, పండగనాడైనాసరే, భిక్షాన్నము తెచ్చేందుకు వెళ్లవలసిందే. 'అయ్యా, ఈ రోజు వీళ్లు పెట్టారని మనం భిక్షకు పోకుంటే రేపు పెట్టరయ్యా!' అనేవారు.

దశయ్య:- స్వామి! ఆశ్రమాన్ని కనిపెట్టుకొని ఇరవై మంది ఉన్నాము. మేమంతా బ్రతికేదెట్టా?

శ్రీస్వామి:- ఈ పండేదంతా ఎవరిదనుకున్నావయ్యా.

భగవంతుడే అందరికీ ఆకలిచ్చి దానికి తగిన ఆహారాన్ని పండేటట్లు చేస్తున్నాడు. మన చేలో పండింది గనుక అంతా మనమే తినాలనే స్వార్థబుద్ధి మాని పంటనిచ్చిన దైవము ఎడల కృతజ్ఞతా భావముతో విరివిగా దైవము పేరిట దానధర్మాలు చేయమని శ్రీస్వామివారు బోధిస్తున్నారు.

శ్రీస్వామివారికి భిక్షగానీ, నైవేద్యంగానీ, దానంగానీ సమర్పించేటప్పుడు ఈ కృతజ్ఞతా భావముతో సమర్పిస్తే అది మహత్తరమైన ఫలితమిస్తుంది. భిక్షగాడనే భావనతో వేస్తే దానికి తగిన స్వల్ప ఫలితమే దక్కుతుంది.

తమ మహాసమాధి అనంతరం కూడా వీరు తమ సేవకుల హృదయాలను తగు విధంగా ప్రేరేపించి ఈ నిరంతర భిక్ష సాంప్రదాయమును కొనసాగించుచున్నారు.

శ్రీస్వామివారి ఆజ్ఞమేరకు అన్నం తినడం మాని అటుకులు, చక్కెర నీళ్ళతో జీవిస్తున్న రోశిరెడ్డి ఇలా చెప్పారు. 'నాకు వృద్ధాప్యమువల్ల కంటి చూపు బొత్తిగా కానరాదు. అందులో ద్రవాహారం తీసుకుంటాను గనుక చాలా బలహీనంగా వుంటాను. అదేమి చిత్రమోగానీ భిక్షకు వెళ్ళే వేళయితే కొండంత బలం వచ్చి, ఇక పడుకో బుద్ధెయ్యదు. భిక్షాపాత్ర తీసుకొని పోతుంటే స్వామి దయవలన దోవన తెల్లని దారం పట్టినట్లుగా స్వల్పంగా జాడ తెలుస్తుంది. అలా పోతుంటే ఒక్కరోజైనా ముల్లుగుచ్చుకొనిగానీ, రాయి ఎదురు తగిలిగానీ ఎరుగను. రెండున్నర కిలోల బియ్యపన్నంపట్టే టిఫిను, మజ్జిగ టిఫిను, భక్తులు ఇచ్చిన ఇతర వస్తువులు ఎక్కడా క్రింద పెట్టకుండా ఆశ్రమం చేర్చినదాకా బాగా వుంటాను. స్నానం చేసి, శ్రీస్వామివారికి నమస్కారం చేశాక ఆ శక్తంతా ఏమవుతుందో ఏమో నిర్వీర్యంగా పక్కమీద వాలితే ఇక రేపు భిక్షవేళకే తిరిగి శక్తి వస్తుంది. ఇది కేవలం శ్రీస్వామివారి కృపగాక మరేమిటి? శ్రీస్వామివారు నాకిచ్చిన ఈ సేవ చివరి శ్వాసవరకు చేయడమే నా పరమ కర్తవ్యంగా తలుస్తున్నాను'.

రోశిరెడ్డిగారు మే నెల 1986లో పరమపదించాక ఈ సేవను శ్రీ రామయ్య వంటి ఇతర సేవకులు చేసేవారు. ఒకప్పుడు అనివార్య కారణాల వలన భిక్షాన్నానికి వెళ్ళే మగవాళ్లెవ్వరు ఆశ్రమంలోలేరు. అలాంటి పరిస్థితులలో గూడా నిరంతరం సాగే ఈ కార్యక్రమం నిలచిపోకుండా శ్రీస్వామివారు ఒక చిత్రమైన లీల ప్రదర్శించారు.

చిన్ననాడే భర్తపోయాక దుఃఖము వలన ఆకలి లేమితో మంచం పట్టి చావనున్న కోడూరు వెంకమ్మ శ్రీస్వామివారి కృపవలన స్వస్థత చెంది ప్రస్తుతం ఆశ్రమంలో ఉంటుంది. ఈమె ఏనాడూ గ్రామంలోకి వెళ్ళి ఎరుగదు. ఈమెకు శ్రీస్వామివారు ఎలాంటి ప్రేరణ నిచ్చారోగానీ నిరంతర భిక్ష నిలచిపోకుండా ఆనాడు తానే భిక్షకు బయలుదేరింది. ఆ విధంగా ఈమె సుమారు ఒక సంవత్సరము శ్రీస్వామివారికి భిక్ష తెచ్చే సేవ చేయగల్గింది. నేటికీ స్వామి కృపవలన ఈ కార్యక్రమం కొనసాగుతూనే వుంది. శ్రీస్వామివారి కృపవలన వేళకు వచ్చిన అతిథులందరికి ఆశ్రమంలో ఉచిత భోజన వసతి శ్రీస్వామివారే కల్పించుచున్నారు.

భిక్షాన్నాన్ని గూర్చి రోశిరెడ్డిగారు చెప్పిన మాటలు గమనార్హము.

'ఆశ్రమంలో ఎక్కువమంది అతిథులు వచ్చిన రోజు ఎక్కువ అన్నం దొరుకుతుంది. తక్కువమంది వస్తే తక్కువే దొరుకుతుంది. నిండా ఆరోగ్యం బాగాలేదు. ఈరోజు ఊరంతా తిరుగగలనా అనుకుంటే ఎప్పుడు తిరుగుతానో ఏమో, రెండు టిఫిన్లు క్షణంలో నిండి కూర్చుంటాయి. శ్రీస్వామివారి మహత్తు చెప్పేందుకు కాదులేయ్యా. అది ఎవరికి వారు తెలుసుకోవలసిందే' అంటారు రోశిరెడ్డిగారు.

ఇదేవిధంగా ఏ రోజు వస్తువులు ఆశ్రమంలో లేకుంటే అవసరానికి తగినవాటిని ఎవరో ఒకరు తెచ్చి ఇవ్వనే ఇస్తారు. 'నేను చాటుకు పోయాక కూడా నేనున్నప్పుడు జరిగినట్లే జరుగుతుంది' అని శ్రీస్వామివారిచ్చిన అభయం నేడు అక్షరాలా నిజమైంది.

